


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 575 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 02 ఆదివారం నవంబరు 2025 పేజీలు : 4 వెల : అమూల్యం

## శ్రీకాకుళం జిల్లాలో

# ఘోర విషాదం..

### కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట, 9 మంది భక్తుల మృతి



- ఏకాదశి కావడంతో ఆలయానికి భారీగా పోటెత్తిన భక్తులు
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
- కొనసాగుతున్న సహాయక చర్యలు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం

2

శ్రీకాకుళం సింహగర్జన ప్రతినిధి,, నవంబర్ 01:
శ్రీకాకుళం జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కాశీబుగ్గ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడమే ఈ విషాదానికి కారణమైంది.ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు కాశీబుగ్గ ఆలయానికి పోటెత్తారు. ఒక్కసారిగా రద్దీ పెరిగిపోవడంతో తోపులాట జరిగి, అది కాస్తా తొక్కిసలాటకు దారితీసింది. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే పలువురు భక్తులు కిందపడిపోయారు. వారిపై నుంచి ఇతరులు పరుగులు తీయడంతో ఊపిరాడక కొందరు అక్కడికక్కడే మృతి చెందారు.




## టెక్నాలజీ, ఏఐ సాయంతో

# విపత్తును ఎదుర్కొన్నాం

మొంథా తుపాన్ యోధులను సత్కరించిన సీఎం చంద్రబాబు

**టీమ్ స్పిరిట్‌తోనే తుపాన్ నష్టాన్ని తగ్గించగలిగామని వెల్లడి**

**భవిష్యత్ కార్యాచరణ కోసం మాన్యువల్ రూపొందిస్తామని ప్రకటన**

**గ్రామ స్థాయి వరకు హెచ్చరికల వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు**

**డ్రోన్ల ద్వారా పలువురి ప్రాణాలు కాపాడామన్న ముఖ్యమంత్రి**



అమరావతి సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 01:మొంథా తుపాన్‌ను టీమ్ స్పిరిట్, ఆధునిక టెక్నాలజీతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో పెను నష్టాన్ని నివారించగలిగామని ఆయన ప్రశంసించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తుపాన్ సమయంలో అద్భుతమైన పనితీరు కనబరిచిన 137 మంది 'మొంథా ఫైటర్ల'ను ఆయన సత్కరించి, మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.
ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ప్రతి సంక్షోభం మనకు ఒక అవకాశం. ఈసారి తుపాన్ నష్టాన్ని తగ్గించడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ప్రజల తరఫున ధన్యవాదాలు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తుందనడానికి ఈ విజయమే నిదర్శనం.



# తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టండి

సింహగర్జన ప్రతినిధి,, నవంబర్ 01:
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందాలు వేర్వేరుగా సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి వారిని ఆహ్వానించారు.కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందంతో జరిగిన సమావేశంలో ఐటీ, ఫార్మా, ఏరో స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో కెనడాతో భాగస్వామ్యంపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కెనడా హైకమిషనర్‌కు వివరించారు.



# వెలుగుల వసంతం

పల్లవికందని పదాలు ఉన్నాయా
పరిస్థితులు మారని రోజులు ఉన్నాయా
ఆకాశం అందదని తెలిసి అందుకోవాలని ఆశపడటం మనదే తప్పు
ప్రాయంలో పరిచయమైన స్నేహాలు కలకాలం మనతో ఉండవని చెప్పినా వినకపోవడం మన మనసు చేసిన తప్పు
తప్పొప్పులను సరి చేసుకుంటూ ముందుకు సాగడమే జీవితం
ఆశల్ని, ఆశయాల్ని ఒక తాటిపై నడిపిస్తూ ముందుకు పోతేనే గెలుపు....

పదాలను పుట్టించడం తెలికే కావచ్చు, కానీ ఆ పదబంధానికి అర్థాన్ని, భావాన్ని సమకూర్చడం మనసుతో కూడుకున్న విషయం, నెలరోజులు కష్టపడితే నాలుగు సంవత్సరాలు సుఖంగా బ్రతకొచ్చేమో, అదే నాలుగు సంవత్సరాలు కష్టపడితే 40 సంవత్సరాలు హుందాగా బ్రతకొచ్చు, శరీరంలో సత్తువ ఉన్నప్పుడే జీవితం కోసం పరుగులు పెట్టాలి, పోయాక జీవాన్ని కాపాడుకోవడానికి బంధాలకు ఒత్తులు వత్తాలి, తన మాటలతో ఇప్పటికీ ఎందరో మంది జీవితాలలో వెలుగులు నింపారు, తన రాతలతో అర్థవంతమైన భావాలకు ఊపిరి పోసారు, జనులను ప్రోత్సహిస్తూ, ధైర్యం ఇస్తూ ఆమె అక్షరాలు ఆగక నిరంతరం ప్రవహిస్తూనే ఉంటాయి, గొప్ప అభిలాషను గుండెల్లో నింపుకుని ముందుకు సాగుతున్న రచయితకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతూ....

**- ఇక కవిత్వం విషయానికి వస్తే**

**- శీర్షిక : చీకటి వలసే ఓ వెలుగు విహారం...!**

ఎవ్వరికీ ఇష్టంలేని అసహ్యమైన
నిన్నటి దుమ్ములో నడిచిన ఆ గొంగళిపురుగు..!
నిశ్శబ్దంగా నిరాశతో నిండిన చూపులు అవి
ఎవరూ చూడని మూలలో బతుకుతూ
కలల విత్తనాలు నాటింది మనసులో నెమ్మదిగా..!

చిన్న అడుగుల వెనుక పెద్ద ప్రయాణం దాగి,
అంధకారంలోనే వెలుగుని పెనవేసుకుని..!
దుప్పటి వంటి కోశంలో తాను మూసుకుపోయి,
తానొక అద్భుతం సృష్టించుకొని
రూపాంతరాన్ని సాధించింది ప్రశాంతంగా..!

చీకటినిచీల్చి వెలుగును ఆ గొంగళి తొంగిచూసింది
తన రెక్కలను విప్పి ఆకాశాన్ని తాకింది..!
ఆ నిన్నటి గొంగళి పురుగు
రేపటి ఉదయాన రంగుల రెక్కలతో
స్వేచ్ఛగా ఎగిరే అందమైన సీతాకోకచిలుకగా..!

రంగుల లోకంలో ప్రేమను పంచుతూ
బాధలన్నీ వెనుకకు వదిలేస్తుంది నిదానంగా..!
స్వేచ్ఛకు చిహ్నమై కలలకు ప్రతీకగా
నిన్నటి కష్టమే రేపటి అందమని చూపిస్తూ
జీవిత పాఠమైంది ఆ సీతాకోకచిలుక పోలికగా..!

**- రచయిత : మంగలక్ష్మి తలాటం**

సమీక్ష

అందరికీ అఇష్టమే, అసహ్యంగా చూస్తారు కదా గొంగళి పురుగుని, నిశ్శబ్దంగా నిరాశతో నిండిన చూపులతో మూలన బ్రతుకుతూ కలల విత్తనాలు నాటుకుంటుంది మనసులో నెమ్మదిగా...

కదిలే ప్రతి అడుగు వెనక ఉన్న ధ్యేయం ఏమిటో ఆశయం ఏమిటో ఎవరికి తెలుసు, అంధకారంలోనే వెలుగుని పెనవేసుకొని దుప్పటి వంటి కోశంలో తాను మూసుకుపోయి అద్భుతం సృష్టించుకుని రూపాంతరాన్ని సాధిస్తుంది ప్రశాంతంగా...

చీకటినిచీల్చి వెలుగులు ఆ గొంగళి తొంగి చూసింది, రెక్కలను విప్పి ఆకాశాన్ని తాకింది నిన్నటి గొంగళిపురుగు రేపటి ఉదయాన రంగుల రెక్కలతో స్వేచ్ఛగా ఎగిరే అందమైన సీతాకోకలా మారి...

అనంతమైన ఈ లోకంలో ప్రేమను పంచుతూ బాధలన్నీ వెనుకకు వదిలేస్తుంది నిదానంగా, స్వేచ్ఛకు చిహ్నమై కలలకు ప్రతీకగా నిన్నటి కష్టమే రేపటి అందమని చూపిస్తూ జీవితపాఠం అయిపోయింది సీతాకోకచిలుక పోలికగా... అంటూ తనని తాను




రచయిత : మంగలక్ష్మి తలాటం సమీక్ష : పోలగాని భానుతేజశ్రీ

రూపుదిద్దుకుంటూ రూపాంతరాలు చెందుతూ, మట్టిలో పుట్టిన వాడు కష్టపడితే ఏనాటికైనా ఆకాశమంత విజయాన్ని సాధించగలడు అని, గొంగళి పురుగు సీతాకోకచిలుకగా మారే విధానాన్ని ఆదర్శంగా తీసుకొని ఎంతో ఉన్నతంగా మనిషి జీవిత గెలుపుని వివరించి చెప్పారు రచయిత.

కాదేది కవితకు అనర్హం అని శ్రీశ్రీ గారు అన్నట్టు కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదు, సాధించాలన్న తపన మన నరాల్లో ప్రవహిస్తూ ఉంటే, ఎంతటి కష్టం ఎదురైనా సరే అధిగమించి అనుకున్నది దక్కించుకోగలం అంటున్నారు ఈ రచయిత.

ఇలాంటి ఆదర్శ పూరితమైన అర్థవంతమైన, కవనాలు మరెన్నో మీరు లిఖించాలని ఈ సాహితీ ప్రయాణంలో ఎదురయ్యే ప్రతి ఒక్కరికి మీ ఉన్నతమైన ఆలోచనలు ఊరటగా నిలవాలని, వెలుగులను వెదజల్లే మీ ఆలోచనలు అనుక్షణం ప్రకాశిస్తూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**సమీక్ష - పోలగాని భాను తేజశ్రీ**

# స్వర్ణాంధ్ర సెంటర్లుగా గ్రామ వార్డు సచివాలయాలు

గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత అదే ఏడాది అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఈ వ్యవస్థకు నాటి సీఎం జగన్ అంకురార్పణ చేశారు.

ప్రతీ రెండు వేల మందికి ఒక సచివాలయం అని డిజైన్ చేశారు. అంతే కాదు జిల్లా స్థాయిలో ఏఏ విభాగాలు ఉంటాయో అవన్నీ కూడా సచివాలయంలో ఉండేలా చూశారు. పది మందిని వార్డు గ్రామ సచివాలయాలలో నియమించారు. వారితోనే పౌర సేవలు మొత్తం నిర్వహించేలా రూపకల్పన చేశారు. అంతే కాదు వారితోనే క్షేత్ర స్థాయిలో పాలన జరిగేలా చూశారు. వైసీపీ అయితే ఇది గొప్ప పాలనాపరమైన సంస్కరణలుగా చెప్పుకుంటుంది.

**లోపాలు ఎన్నో :**

అయితే వైసీపీ దీనిని ఏర్పాటు చేసిన ఉద్దేశ్యం మంచిదే కానీ తొందరపాటుతో చేశారో లేక ఎక్కువ మందికి ఉపాధి అన్న కాన్సెప్ట్ తో చేశారో తెలియదు కానీ వార్డు గ్రామ సచివాలయాల్లో మొత్తం లక్షా పాతిక వేల మంది దాకా సిబ్బందిని నియమించారు వీరందరికీ 35 వేల దాకా ఒక్కొకరికి వంతున చెల్లిస్తూ వస్తున్నారు. అనేక విభాగాలను అక్కడ అందుబాటులో ఉంచుతూ కార్యదర్శుల నియామకం చేశారు. అయితే ప్రతీ వార్డులో వివిధ విభాగాలకు సంబంధించిన పనులు లేకపోవడంతో ఉన్న పది మందిలో సగానికి పైగా పెద్దగా పని భారం లేకుండానే ఖాళీగా గడిపేసే పరిస్థితి ఏర్పడింది అంతే కాదు ఉన్న ఇద్దరు ముగ్గురి మీద భారీగా పని ఒత్తిడి పెరిగి అసంతుల్యంగా ఈ వ్యవస్థ తయారు అయింది అన్న విమర్శలు వచ్చాయి. అంతే కాదు పంచాయతీలకు వార్డులకు సమాంతరంగా ఈ వ్యవస్థ ఉందన్న చర్చ కూడా సాగింది.

**కూటమి ప్రభుత్వం ఫుల్ ఫోకస్ :**

ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థను పూర్తిగా అధ్యయనం చేస్తోంది. ముందుగ మహిళా పోలీసుల విషయంలో నిర్ణయం తీసుకుంది వారు కోరుకుంటే పోలీస్ వ్యవస్థలో కానీ లేదా మహిళా విభాగంలో కానీ నియామకాలు జరిపేలా చర్యలు తీసుకుంది. అలాగే రేషనలైజేషన్ కింద మొత్తం వార్డులను కూడా కుదిస్తూ మరో నిర్ణయం తీసుకుంది దాని ప్రకారం పౌర సేవలను అందిస్తూనే అవసరమైన సిబ్బందితోనే ఈ సచివాలయాలు నడిచేలా చూడాలని నిర్ణయించింది ఇక ఇందులో ప్రతిభావంతులను వేరే విభాగాలకు పంపిని అక్కడ సిబ్బంది కొరతను తీర్చుకోవాలని చూస్తోంది

**ఉప సంఘం నియామకం :**

అలాగే వీరికి పదోన్నతులు పే స్కేల్ వంటి వాటి విషయంలో కూలకన్షంగా చర్చించేందుకు మంత్రులతో ఒక కమిటీని కూడా తాజాగా ఏర్పాటు చేసింది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మంత్రివర్గ ఉప సంఘంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటుగా మరో 9 మంది మంత్రులు సభ్యులుగా ఉన్నారు. ఈ మంత్రివర్గ ఉప సంఘం ప్రమోషన్లపై చర్చించి, అధ్యయనం జరిపి ప్రభుత్వానికి నివేదించనుంది.

**కొత్త పోస్టులు కూడా :**

అదే విధంగా ఈ సచివాలయాలలో ఇంటర్‌మీడియేటరీ పోస్టులను సృష్టించే అంశం గురించి చర్చించాలని కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే ఆయా పోస్టుల పే స్కేల్ నిర్ణయించాలని సూచించింది. ప్రమోషన్ల తర్వాత ఖాళీల భర్తీని ఎలా పూర్తి చేయాలనే పద్ధతిపైనా చర్చించాలని స్పష్టం చేసింది. వీలైనంత త్వరగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతుల అంశం గురించి అధ్యయనం పూర్తి చేసి సిఫార్సులను ప్రభుత్వానికి నివేదించాలని కోరింది.

**స్వర్ణాంధ్ర సెంటర్లుగా :**

అంతే కాదు గ్రామ వార్డు సచివాలయాల పేర్లను మార్చాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది. గ్రామ సచివాలయాలు పేరు తీసివేసి స్వర్ణాంధ్ర సెంటర్లని పెడితే ఎలా ఉంటుందనే అంశంపై ప్రభుత్వం చర్చిస్తోందని అని అంటున్నారు. అలా చేయడం వల్ల పూర్తిగా దానికి కూటమి ప్రభుత్వం కళ వస్తుందని జనాలకు కొత్తగా ఉంటుందని పంచేసే సిబ్బందికి కూడా లక్ష్యాలు తెలుస్తాయని సాఫీగా పాలన క్షేత్ర స్థాయిలో జరిగేలా ఒక విధానం అమలు అవుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. తొందరలో దీని మీద నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. ఇక ఈ కొత్త పేరు కనుక పెడితే వైసీపీ మా సృష్టి గ్రామ వార్డు సచివాలయాలు అని చెప్పుకుని క్లెయిం చేసుకోవడానికి ఏమీ ఉండదని అంటున్నారు.

# శీకాకుళం జిల్లాలో ఘోర విషాదం..

ఈ విషాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ విషాద ఘటనలో భక్తులు మృతి చెందడం హృదయ విదారకం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను” అని ఆయన పేర్కొన్నారు. గాయపడిన వారికి వేగంగా, సరైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు చంద్రబాబు తెలిపారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని కోరినట్లు వివరించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# స్కూల్ బస్సుల భద్రతపై రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం.

పీలేరు, ఇంచార్జ్.నవంబర్ 1:

పీలేరు రవాణా శాఖ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి. విజయ కుమారి ఆధ్వర్యంలో శనివారం స్కూల్ యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లతో అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయ్ కుమారి మాట్లాడుతూ, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యాసంస్థ కూడా తమ స్కూల్ బస్సులను సక్రమంగా నిర్వహించాలని. జిల్లా రవాణా అధికారి సూచనల మేరకు బస్సుల భద్రతా పరిశీలనకు సంబంధించిన చెక్‌లిస్ట్‌ను వివరించారు. బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, స్పీడ్ గవర్నర్, ఫైర్ ఎక్స్టింగ్విషర్‌లు, హ్యాండ్ బ్రేక్, సర్వీస్ బ్రేక్‌లు, ఫైర్ డిటెక్షన్ మరియు అలార్మింగ్ సిస్టమ్స్ వంటి భద్రతా పరికరాలు తప్పనిసరిగా సక్రమంగా పనిచేయాలన్నారు. అదనంగా, స్కూల్ బస్సుల పైభాగంలో నాలుగు మూలల వద్ద అంబర్ లైట్లు ఏర్పాటు చేయాలని, డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థుల ప్రాణ భద్రతకు ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. నవంబర్ 10లోపు అన్ని స్కూల్ బస్సులను పరిశీలించి లోపాలను సరిదిద్దాలని, ఆ తర్వాత మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ద్వారా ఫిజికల్ ఇన్స్పెక్షన్ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిధిలోని పలు స్కూల్‌ల ప్రతినిధులు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.



మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టీ. విజయ కుమారి, పీలేరు

# టెక్నాలజీ, ఏఐ సాయంతో విపత్తును ఎదుర్కొన్నాం

ఈ అనుభవాన్ని భవిష్యత్తులో విపత్తుల నిర్వహణ కోసం ఒక మాన్యువల్‌గా రూపొందిద్దాం” అని పిలుపునిచ్చారు.

**టెక్నాలజీతో నష్ట నివారణ**

తుపాన్ల సమయంలో టెక్నాలజీ వినియోగంపై చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. “ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) మోడల్స్, ‘అవేర్ 2.0’ వ్యవస్థ ద్వారా తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాం. మానిటరింగ్, అలెర్ట్, రెస్క్యూ, పునరావాసం, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ అనే ఐదు సూత్రాల ఫార్ములాతో నష్టాన్ని తగ్గించగలిగాం. రియల్ టైమ్‌లో హెచ్చరికలు జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేశాం” అని వివరించారు. సమర్థ నీటి నిర్వహణతో రాయలసీమలో కరువును జయించినట్లే, టెక్నాలజీతో కోస్తాంధ్ర తుఫాన్ల ప్రభావాన్ని తగ్గిస్తున్నామని అన్నారు.

**క్షేత్రస్థాయిలో సమష్టి కృషి**

తుపాన్ సమయంలో చేపట్టిన సహాయక చర్యలను ముఖ్యమంత్రి కొనియాడారు. “డ్రోన్ల సహాయంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడాం. పర్చూరు వాగులో చిక్కుకున్న షేక్ మున్నాను, ఒక ప్రార్థనా మందిరంలో ఉన్న 15 మందిని రక్షించిన విషయాన్ని గుర్తుచేశారు. ముందస్తుగానే 602 డ్రోన్లను సిద్ధం చేశామని, కాలువల్లో పూడిక తీయడం వల్ల భారీ వర్షాలకు కూడా వరద ముప్పు తగ్గిందని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు సీఎస్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అంతా కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది” అని తెలిపారు.

**త్వరలో గ్రామ స్థాయి వరకు హెచ్చరికల వ్యవస్థ**

త్వరలోనే రాజధాని నుంచే నేరుగా గ్రామ స్థాయి వరకు హెచ్చరికలు పంపే వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, మంత్రులు అనిత, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాశ్, డోలా బాలవీరాంజనేయ స్వామి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట విషాదకరం



మంగళగిరి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 01 : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలచివేసింది. కార్తీక ఏకాదశి సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న క్రమంలో తొక్కిసలాట మూలంగా తొమ్మిది మంది మృతి చెందారని తెలిసి ఆవేదనకు లోనయ్యానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ విషాదకర ఘటనలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వం దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొంటుందని, ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న ఈ ఆలయంలో చోటు చేసుకున్న విషాదకర ఘటనపై విచారణ చేపడుతుందన్నారు. కార్తీక మాసంలో రాష్ట్రంలోని శైవ క్షేత్రాలతోపాటు, ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. క్యూ లైన్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచిస్తున్నాను. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. ఆలయ ప్రాంగణాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనాకు వచ్చినప్పుడు పోలీసు బందోబస్తుతోపాటు, మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలన్నారు

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సేవలు భేష్

## - ఎంపీ హరీష్ కు కితాబు ఇచ్చిన సిఎం చంద్రబాబు

అమలాపురం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 01 : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో భేష్ అంటూ అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కితాబు ఇచ్చారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం సూచించిన ముందస్తు చర్యలకు అధికారులను సమన్వయం చేయడం, అలాగే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని తీర ప్రాంతాల ప్రజలకు ఎమ్మెల్యేలతో కలసి గ్రామస్తులకు సూచించడంలో చురుగ్గా వ్యవహరించడంలో హరీష్ ముందున్నారు. అలాగే తుఫాన్ తీరం దాటే సమయంలో మంగళవారం అర్ధరాత్రి వేళ అంతర్వేది పునరావాసానికి చేరుకుని, అక్కడ ఉన్న వారికి ధైర్యం చెప్పి అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంపీ హరీష్ ను ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికను అందజేశారు. తనపై నమ్మకంతో గెలిపించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు సేవ చేయడం తన బాధ్యత అని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.



## పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 01 : జగ్గంపేటలో నిర్వహించిన ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు జ్యోతుల నవీన్ పెన్షన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఎవరూ ఆర్థికంగా గానీ, సామాజికంగా గానీ వెనుకబడకూడదు అనే ఆలోచనతో అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రతిక్షణం ప్రజా సంక్షేమం, ప్రజా అభివృద్ధి



కోసం కృషి చేస్తున్నారని నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, భూపాలపట్నం ప్రసాద్, కోండ్రోతు శ్రీను, తుమ్మల కిషోర్, బండారు నాని తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ భవనం శంకుస్థాపనకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఆహ్వానించిన గండేపల్లి ఆర్యవైశ్య సంఘం

జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి నవంబర్ 01: జగ్గంపేట మండలం ఇర్రిపాక ఎమ్మెల్యే స్వగృహంలో గండేపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వాకచర్ల బాబ్జి ఆధ్వర్యంలో నవంబర్ రెండవ తేదీ ఆదివారం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య వనభోజనాలకు ఆహ్వానం పలికి, ఆర్యవైశ్య కమిటీ భవనానికి స్థలం కేటాయించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృతజ్ఞతలు తెలియజేసారు. ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా కమ్యూనిటీ భవన శంకుస్థాపనకు నిర్వహించేందుకు ఎమ్మెల్యే నెహ్రూను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా గండేపల్లిలో ఆర్యవైశ్య కమ్యూనిటీ భవనం నిర్మించుకుందామని ప్రయత్నాలు చేస్తున్న తమకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో స్థలం కేటాయించి పంచాయతీ తీర్మానం చేసి నవంబర్ రెండో తేదీన ఆయన చేతి మీద శంకుస్థాపన చేసుకుంటున్నామని అన్నారు.
ఈ కార్యక్రమంలో జల్లూరి ప్రదీప్, మామిడిపాక వెంకటరత్నం, వాకచర్ల బాబ్జి, వాకచర్ల నాగేశ్వరరావు, వాకచర్ల గోపి, మాతంశెట్టి రాము, సత్యవరపు బాబి, సత్యవరపు ప్రసాద్, ఎలమాటి కాశి, రెడ్డి సుబ్బారావు, ఇప్పర్ల బాబి తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వాన్ని చాటుకున్న పుడమి ఫౌండేషన్

నారాయణపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 01 : నారాయణపేట జిల్లా కచ్వార్ టోల్ గేట్ దగ్గర మతిస్థిమితం లేని వ్యక్తి చాలా రోజుల నుండి అక్కడే ఉంటూ కనిపించడం జరిగింది. ఆ వ్యక్తి జుట్టు పెరిగిపోవడంతో పాటు సరైన బట్టలు లేకపోవడం, అశుభ్రంగా ఉండడం చూసి పుడమి ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటపతి రాజు ఆధ్వర్యంలో ఆ వ్యక్తిని శుభ్రపరచి కొత్త బట్టలు తొడిగించడం జరిగింది. ఈ వ్యక్తిని హైదరాబాదులోని ఆశ్రమాలలో చేర్పిద్దామని ప్రయత్నం చేసినప్పటికీ వారిని సంప్రదించగా ఆశ్రమాలన్నీ ఎక్కువ సంఖ్యలో ఇలాంటి వారు ఉన్నారని తెలిసింది. కావున ఆశ్రమాలలో చేర్పించలేకపోయామన్నారు. పుడమి ఫౌండేషన్ తమ శక్తి మేరకు మానవ సేవలో ఉంటామని తెలియజేస్తున్నామన్నారు. ఇలాంటి వారి పట్ల ఉదార భావంతో వ్యవహరించి సహాయపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పుడమి ఫౌండేషన్ ఛైర్మన్ జె.వెంకటపతి రాజు, సభ్యులు యం.వెంకటేష్ బాబు, కె.సురేష్, కె.లక్ష్మణ్, జె.నాగరాజు, జె.రమేష్, జె.తరుణ్, కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.





# అత్యంత వైభవంగా వేణుగోపాలుని వార్షిక కళ్యాణ వేడుక

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 01 : పట్టణంలో వేంచేసి ఉన్న అతి పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవం అతి వైభవముగా నిర్వహించారు. కన్నుల పండుగగా సాగిన ఈ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు భక్తి శ్రద్ధలతో వీక్షించారు. స్వామి అమ్మవార్లకు ఉదయం ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం మహిళా భక్త బృందంచే స్వామి అమ్మవార్లను కళ్యాణ అలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, మహ సంకల్పంతో స్వామి కళ్యాణం చేసారు. ఆలయ ఈఓ నున్న శ్రీరాములు, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి సేవాసమితి సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించగా యాగ్నిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠచార్యులు, అర్చకులు పి.విజయజనార్ధనాచార్యులు, వేణుగోపాల సి.హెచ్.అవినాష్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చెరుకుపల్లి శ్రీనివాసు, ప్రియాంక, పైండా రమ, శ్రీరామ్, మోహన్, అప్పలరాజు స్థానిక విద్యా గణపతి భక్త బృందం సభ్యులు, దేవాలయ సిబ్బంది సత్యనారాయణ, స్థానిక వేదపండితులు పాల్గొన్నారు.

# తుఫాన్ సేవలకు గౌరవం

## - సిఎం చేతుల మీదగా అవార్డు అందుకున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు






అమరావతి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 01 : మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల కష్టసుఖాలను అర్థం చేసుకుంటూ, సహాయక చర్యల్లో ముందుండి సేవలందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించింది. ఈ నేపథ్యంలో కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన చేతుల మీదుగా ప్రశంసా అవార్డును ప్రదానం చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో బండారు సత్యానందరావు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు, పునరావాస చర్యల్లో కీలక పాత్ర పోషించారు. ప్రజలతో నేరుగా మమేకమై, ప్రతి బాధితుడికి అండగా నిలిచిన ఆయన సేవలను సిఎం ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రజా సేవే నా ధ్యేయం. ఈ గుర్తింపు సిఎం ఇచ్చిన ప్రోత్సాహం మాత్రమే కాదని, ఇది తనకు మరింత బాధ్యతను గుర్తు చేస్తున్నదన్నారు. తుఫాన్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సేవలను ప్రభుత్వం భవిష్యత్తులో కూడా గుర్తించి ప్రోత్సహిస్తుందని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

# కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట విషాదకరం

మంగళగిరి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 01 : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలచివేసింది. కార్తీక ఏకాదశి సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న క్రమంలో తొక్కిసలాట మూలంగా తొమ్మిది మంది మృతి చెందారని తెలిసి ఆవేదనకు లోనయ్యానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ విషాదకర ఘటనలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వం దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొంటుందని, ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న ఈ ఆలయంలో చోటు చేసుకున్న విషాదకర ఘటనపై విచారణ చేపడుతుందన్నారు. కార్తీక మాసంలో రాష్ట్రంలోని శైవ క్షేత్రాలతోపాటు, ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. క్యూ లైన్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచిస్తున్నాను. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. ఆలయ ప్రాంగణాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనాకు వచ్చినప్పుడు పోలీసు బందోబస్తుతోపాటు, మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలన్నారు




## హరీష్ రావు ను పరామర్శించిన టియుడబ్ల్యూజే (హెచ్143) రాష్ట్ర నాయకులు

నాగర్ కర్నూల్ జిల్లా నవంబర్ 1
మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి ఇటీవల మృతి చెందగా శనివారం టి యు డబ్ల్యూ జే (హెచ్ 143) జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు పరామర్శించి హరీష్ రావు తండ్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. హైదరాబాద్ కోకాపేటలోని మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో టియుడబ్ల్యూజే (హెచ్ 143) రాష్ట్ర సలహాదారులు, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, టీయూడబ్ల్యూజే (హెచ్ 143) రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ తదితరులు హరీష్ రావు కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

# క్యూట్ గా అనిపిస్తూనే భయపెట్టేస్తోన్న డింపుల్ హయతి!

హీరోలతో పోల్చుకుంటే హీరోయిన్లు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా సందర్భం ఏదైనా సరే తమ అందాలతో అలరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయా సందర్భాలకు సంబంధించి గెటప్ లు మారుస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. ఇకపోతే అక్టోబర్ లో దీపావళి వేడుకలను చాలా ఘనంగా సెలబ్రేట్ చేసుకొని.. ఆ ఫోటోలను షేర్ చేసిన సెలబ్రిటీలు.. ఆ తర్వాత కార్తీకమాసం సందర్భంగా కార్తీక దీపోత్సవం కోసం సిద్ధమవుతూ.. ఇప్పుడు ఈ ఫోటోలను షేర్ చేయడానికి సిద్ధమవుతున్నారు. మరొకవైపు అక్టోబర్ 31 హాలోవీన్ వేడుకలు ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించి హారర్ గెటప్పులతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.. అయితే ఇలాంటి సమయంలో హాలోవీన్ సెలబ్రేషన్స్ లో భాగంగా తన గెటప్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది.. ఒకవైపు షార్ట్ డెనిమ్ డ్రెస్ ధరించిన ఈమె అందులో క్యూట్ డెవిల్ లా కనిపిస్తూ అందరిని ఆకట్టుకుంది. డెవిల్ అంటేనే హారర్ గెటప్.. కానీ తన అందంతో అభిమానులను మెస్మరైజ్ చేసింది డింపుల్ హయతి. ప్రస్తుతం ఇన్స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.. క్యూట్గా కనిపిస్తూనే భయపెట్టేసింది ఈ ముద్దుగుమ్మ అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు డింపుల్ హాయతి విషయానికి వస్తే.. 2017లో గల్ఫ్ అనే సినిమాతో సినీ రంగంలోకి అడుగు పెట్టింది. 1988 ఆగస్టు 21న తెలంగాణ రాజధాని హైదరాబాదులో జన్మించిన ఈమె.. సినీరంగంలోకి అడుగుపెట్టి ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక 2019లో వచ్చిన యురేకా అనే సినిమాలో నటించిన ఈమె.. అలాగే మెగా ప్రిన్స్ హీరో వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన గద్దలకొండ గణేష్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో జర్రా జర్రా పాటలో తన అద్భుతమైన పర్ఫామెన్స్ తో మెప్పించింది. 2022లో ఫిబ్రవరి 11న విడుదలైన ఖిలాడీ సినిమాలో కూడా నటించి తన స్పెషల్ పెర్ఫార్మెన్స్ తో మెస్మరైజ్ చేసింది ఈ



ముద్దుగుమ్మ. ఇప్పటివరకు ఈమె నటించిన సినిమాల విషయానికొస్తే.. గల్ఫ్ ,యురేకా వంటి తెలుగు చిత్రాలతో కెరియర్ ఆరంభించిన ఈమె.. దేవి 2 అనే తమిళ్ చిత్రం ద్వారా తమిళ ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంది. ఆ తర్వాత అభినేత్రి 2, గద్దలకొండ గణేష్ చిత్రాలలో స్పెషల్ సాంగ్ లతో కూడా ఆకట్టుకున్న ఈమె 2021 లో ఆత్రంగీ రే అనే హిందీ సినిమాలో కూడా నటించింది.. సామాన్యుడు చిత్రంలో కూడా నటించిన ఈమె 2023లో వచ్చిన రామబాణం అనే సినిమాలో భైరవి పాత్ర పోషించి మెప్పించింది. ఇకపోతే అప్పటినుంచి మరో సినిమాలో నటించలేదు డింపుల్ హయతి. కానీ ఇప్పుడు భోగి అనే తెలుగు సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే 2025 అక్టోబర్ 24న దిల్మార్ అనే కన్నడ సినిమాతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధం అయ్యింది. శర్వానంద్ 38వ సినిమాలో కూడా డింపుల్ హయతి భాగమైన విషయం తెలిసిందే




# రెడ్ అవుట్ ఫిట్ లో శ్రద్ధా అందాలు..



సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత సెలబ్రిటీలు ఎక్కువగా దీనిని వేదికగా చేసుకొని తమ అందాలను ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకవైపు సాంప్రదాయంగా.. మరొకవైపు గ్లామర్ వలకబోస్తూ అలాగే తమ సినిమాలకు సంబంధించిన అప్డేట్లను కూడా వదులుతూ అభిమానులకు మరింత దగ్గర అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు అప్పుడప్పుడు లైవ్ చిట్ చాట్ పేరిట అభిమానులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ అందరిని ఆశ్చర్యపరుస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు ఈ చిట్ చాట్ లో భాగంగా ఎన్నో విషయాలను అభిమానులతో షేర్ చేసుకుంటున్నారు.ఇదిలా ఉండగా ఇప్పుడు గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్స్ లో శ్రద్ధ శ్రీనాథ్ కూడా చేరిపోయారు. తాజాగా రెడ్ కలర్ అవుట్ ఫిట్ లో దర్శనమిచ్చిన ఈమె తన అందాలతో మరొకసారి అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. భిన్న విభిన్నమైన ఫోజులు ఇస్తూ.. ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఇటు ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేసింది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే తాజాగా శ్రద్ధ శ్రీనాథ్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. 1990 సెప్టెంబర్ 29న జన్మించిన ఈ ముద్దుగుమ్మ ..తమిళ్, కన్నడ, తెలుగు చిత్రాలలో ఎక్కువగా నటిస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది . తన నటనతో రెండు ఫిలింఫేర్ అవార్డులతో పాటు సైమా అవార్డులను కూడా దక్కించుకుంది.. తొలినాళ్ళ జీవితం విషయానికి వస్తే.. జమ్మూ అండ్ కాశ్మీర్లో ఉదంపూర్ పట్టణంలో కన్నడ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి భారత సైన్యంలోని కమావున్ రెజిమెంటులో అధికారిగా పనిచేస్తున్నారు. తల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు. సికింద్రాబాద్లోని ఆర్మీ స్కూల్ నుండి పాఠశాల విద్యను పూర్తి చేసిన ఈమె ఆ తర్వాత బెంగళూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ లీగల్ స్టడీస్ లో న్యాయ శాస్త్రం అభ్యసించడానికి బెంగళూరుకి కూడా వెళ్ళింది.



## 'స్వయంభు' వచ్చే వరకూ నభా కవితలేనా?

సాయంత్రం వెలుగులో నన్ను వెతుక్కుందాం.. నా ముఖంలో చిరునవ్వుతో, నా హృదయంలో వెచ్చదనంతో.. కూర్చుని ఆకాశ సౌందర్యం గురించి మాట్లాడుకుందాం.. గాలితో ఊపిరి పీల్చుకుందాం.., మేఘాల నీడలో విశ్రాంతి తీసుకుందాం.. సూర్యాస్తమయంలో మారుతున్న రంగుల్లో నవ్వుకుందాం.. ఎప్పటికీ నన్ను వెతుక్కుందాం.. ఎవరిలో ఇంత సొగసైన కవిత్వం పొంగి పొర్లుతోంది? ఏమో! అది నభా నటేష్ కావొచ్చు. ఈ కన్నడ బ్యూటీ టాలీవుడ్ లో అడుగుపెట్టినప్పటి నుంచి కెరీర్ పరంగా వరుసగా అవకాశాలు అందుకుంటూనే ఉంది. కానీ ఊహించని విధంగా కెరీర్ దూసుకెళుతున్న సమయంలోనే ఒకే ఒక్క యాక్సిడెంట్ తన కలల్ని కల్లలు చేసేస్తుందని భయపడినట్టు చెప్పుకొచ్చింది నభా. అప్పట్లో తన కెరీర్ గురించి చాలా ఆందోళన చెందింది. అయితే చూస్తుండగానే అంతా మారిపోయింది. తాను అనుకున్న విధంగా కంబ్యాక్ అయింది. ఇప్పుడు దర్శకనిర్మాతలను ఆకర్షించడంలో రేసులో ముందుంది

ఈరోజు ఉన్నది రేపు ఉండదు.. రేపు ఉన్నది ఆ తర్వాత ఉండదు.. ప్రతి రోజూ మారిపోతూనే ఉంటుంది. లైఫ్ అంటే ఇదే కదా.. అయితే కొంచెం ఓపిక సహనం అవసరం. కాలంతో పాటే మార్పు ఉంటుందని గ్రహించి సహనంతో ఎదురు చూడాలి. ఇప్పుడు తాను వేచి చూసిన సమయం రానే వచ్చింది. తిరిగి ఎప్పటిలానే నభా నటేష్ తన సొగసైన రూపాన్ని తిరిగి పొందింది. బోయ్స్ ని కవ్వించే అందం చందం తనలో మెండుగా ఉన్నాయని చెప్పకనే చెబుతోంది నభా ఇన్ స్టాలోని ప్రతి పోస్ట్. ఎంతో అందంగా డిజైనర్ లుక్కుల్లోకి ఒదిగిపోయి ఫోటోషూట్లలో మిలమిల మెరిసిపోతోంది నభ. తాజాగా నభా నటేష్ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. చాలా సింపుల్ గా.. చాలా నేచురల్ గా సహజసిద్ధంగా ప్రకృతి అందాల నడుమ ఒదిగిపోయి కనిపించింది నభా. వైట్ ఫ్రాక్ లో గుబులు రేపేంత అందంగా కనిపిస్తోంది. మునుపటితో పోలిస్తే జిమ్ లో బాగా శ్రమిస్తోంది. దీని ఫలితం నభా ఎంతో స్లిమ్ గా టీనేజర్ ని తలపిస్తోంది. ఈ మేకోవర్ నిజంగా స్టన్నింగ్. హూ ఆర్ యు క్వీన్ నభా.. ఐ మిస్ యు! అంటూ ఒక అభిమాని లవ్ ఈమోజీలను షేర్ చేసాడు. చాలా మంది అభిమానులు నభా నటేష్ అందచందాలకు మైమరిచి పోతున్నామని చెబుతున్నారు. లవ్ కిస్ ఫైర్ ఈమోజీలతో ఫ్యాన్స్ విరుచుకుపడుతున్నారు. తాజా ఫోటోషూట్ వెబ్‌లో మోంతా తుఫాన్ లా దూసుకెళుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నిఖిల్ సరసన %-%స్వయంభు%-% అనే హిస్టారికల్ వారియర్ డ్రామా చిత్రంలో నటిస్తోంది. భరత్ కృష్ణమాచారి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాపై నభా చాలా హోప్స్ పెట్టుకుంది. కొంత గ్యాప్ తర్వాత తనకు బిగ్ బ్రేక్ ఇస్తుందని నభా ఆశిస్తోంది. నభాతో పాటు, సంయుక్త మీనన్ మరో కథానాయికగా నటిస్తోంది.

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com